# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- మయన్మార్ దేశంలో మండలే కేంద్రంగా రెండు వరుస భూకంపాలు సంభవించాయి.
- అందరితో కలిసి పనిచేయడమే భారత విదేశాంగ విధానమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి కేంద్ర కేబినెట్ ఈరోజు ఆమోదం తెలిపింది.
- పాకిస్తాన్‌లో మైనారిటీల పట్ల జరుగుతున్న దాడులపై అంతర్జాతీయ స్థాయిలో చర్చిస్తామని కేంద్ర మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ చెప్పారు.
- మయన్మార్, థాయిలాండ్ లలో సంభవించిన భూకంపం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ విచారం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మయన్మార్ దేశంలో రెండు వరుస భూకంపాలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై 7.7, 6.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపాలు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగించాయి. భూకంప కేంద్రం మయన్మార్‌లోని మండలే సమీపంలో ఉంది. మయన్మార్ సైనిక ప్రభుత్వం నేపిటావ్ మరియు మండలేతో సహా ఆరు ప్రాంతాలలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. మయన్మార్ లో మండలేలోని ఐకానిక్ వంతెనతో పాటు అనేక భవనాలు కుప్ప కూలినట్లు తెలుస్తోంది. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ కు 900 కిలోమీటర్ల దూరంలో బలమైన ప్రకంపనలు సంభవించాయి. కూలిన భవనాల నుంచి క్షతగాత్రులను రక్షించే పనులు జరుగుతున్నాయి. భూకంప ప్రభావాన్ని అంచనా వేయడానికి థాయిలాండ్ ప్రధానమంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్రా అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో భూకంపం సంభవించిందని థాయిలాండ్ విపత్తు నివారణ విభాగం తెలిపింది. కలకత్తా, ఇంఫాల్ లలో కూడా స్వల్ప ప్రకంపనలు సంభవించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మయన్మార్, థాయిలాండ్ లలో సంభవించిన భూకంపం పట్ల భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ విచారం వ్యక్తం చేశారు. థాయిలాండ్ పౌరుల భద్రత శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమ వేదికగా ప్రధాని మోదీ తెలిపారు. ఈ దేశాలకు సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని సహాయక చర్యలపై ఆయా దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర విదేశాంగ శాఖను సూచించినట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

థాయిలాండ్ అధికారులతో అక్కడి భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. భారతీయ పౌరులకు ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపింది. ఏదైనా అత్యవసర పరిస్థితి

ఏర్పడితే 66 61 88 19 218 నెంబర్ ను సంప్రదించాలని థాయిలాండ్ లోని భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమంలో తెలిపింది. బ్యాంకాక్ లోని భారత రాయబారి కార్యాలయం, చియాంగ్ మై లోని కౌన్సిలేట్ సభ్యులు సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించింది. భూకంప ప్రభావంతో భవనాలు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రతకు పలు భవనాలు దెబ్బతినగా వాటిలోని ప్రజలను ఖాళీ చేయించారు. మయన్మార్ లోని విపత్తు నిర్వహణ బృందాలు ప్రాణాలతో బయటపడిన వారిని గుర్తించి, బాధితులకు సహాయం చేసేందుకు కృషి చేస్తున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అందరితో కలిసి పనిచేయడమే భారత విదేశాంగ విధానమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో ఒక ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత్ ప్రథమం అనేది దేశ విదేశాంగ విధానంలో మంత్రంగా మారిందని చెప్పారు. భారత్ ఎల్లప్పుడూ ఆదిపత్యం కంటే మానవత్వానికే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. 21వ శతాబ్దం సమాన ప్రాతినిధ్యాన్ని అందిస్తోందని చెప్పారు. గడచిన 10 సంవత్సరాలలో GDPని రెట్టింపు చేసుకున్న దేశంగా భారత్ నిలిచిందని, ప్రపంచం మొత్తం భారత్ వైపు దృష్టి సారించిందని అన్నారు. భారత్ లో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. దేశ యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఆవిష్కరణలతో ముందుకు నడిపిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 3వ తేదీ నుండి రెండు రోజుల పర్యటనకు థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌కు వెళ్లనున్నారు. థాయిలాండ్ ప్రధానమంత్రి పేటోంగ్‌టార్న్ షినవత్రా ఆహ్వానం మేరకు 6వ బిమ్ స్టెక్ (BIMSTEC) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ప్రధాని మోదీ థాయిలాండ్ పర్యటనకు వెళ్ళడం ఇది మూడోసారి. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై థాయిలాండ్ ప్రధానమంత్రితో, ప్రధాని మోదీ చర్చిస్తారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి జైదీప్ మజుందార్ వెల్లడిస్తూ..

(వాయిస్.. 30 సెకన్లు)-సెట్

ఈ పర్యటన అనంతరం, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసానాయక ఆహ్వానంపై మోడీ వచ్చే నెల 4వ తేదీ నుండి మూడు రోజులు శ్రీలంకలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో రెండు దేశాల మధ్య గతంలో అంగీకరించిన సహకార రంగాలపై పురోగతిని సమీక్షించి ప్రధానమంత్రి దిసానాయకతో చర్చలు జరుపుతారు. భారత ఆర్థిక సహాయంతో అమలు చేస్తున్న అభివృద్ధి ప్రాజెక్టులను మోడీ అనురాధపురంలో ప్రారంభిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్‌లో మైనారిటీల పట్ల జరుగుతున్న దాడులను భారతదేశం నిశితంగా గమనిస్తుందని, వీటిపై అంతర్జాతీయ స్థాయిలో చర్చిస్తామని కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ అన్నారు. ఈరోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో భారత ప్రతినిధి ఇటీవల పాకిస్తాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలపై వేధింపులు, ప్రజాస్వామ్య విలువలను నాశనం చేస్తున్న విధానాన్ని వివరించారని తెలిపారు. ఇటీవల ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భారత రాయబారి పాకిస్తాన్ దేశ మతోన్మాద మనస్తత్వాన్ని ప్రస్తావించిన అంశాన్ని సభ్యులకు వివరించారు. ఫిబ్రవరి నెలలో, పాకిస్తాన్‌లో హిందూ సమాజంపై 10 దారుణాలు జరిగాయని, వాటిలో ఏడు అపహరణ, బలవంతపు మతమార్పిడికి సంబంధించినవి, రెండు అపహరణలు, హోలీ జరుపుకుంటున్న విద్యార్థులపై పోలీసు చర్యలకు సంబంధించినవి ఒకటి ఉన్నాయని విదేశాంగ మంత్రి సభకు తెలియజేస్తూ..

(వాయిస్.. 30 సెకన్లు)-సెట్

అలాగే.. పాకిస్తాన్‌లో సిక్కు సమాజానికి సంబంధించిన మూడు, అహ్మదీయా సమాజానికి సంబంధించిన రెండు మరియు క్రైస్తవ సమాజానికి సంబంధించిన ఒక సంఘటనలు జరిగాయని, వీటిని భారత్ అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళుతుందని డాక్టర్ జైశంకర్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీని ప్రోత్సహించేందుకు, ఎలక్ట్రానిక్స్ సప్లై చైన్ ను బలోపేతం చేయడానికి ఉపయుక్తంగా నిలిచే ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకాన్ని కేంద్ర కేబినెట్ ఈరోజు ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు శాతం కరువు భత్యాన్ని ప్రకటించింది. దీనిని పెన్షనర్లకు కూడా వర్తింపజేస్తోంది. 2025

జనవరి 1 నుంచి దీన్ని అందించనుంది. దీనితో 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 66.55 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయాలను న్యూఢిల్లీలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి 22 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను అందించడం జరుగుతుందని చెప్పారు. దీని ఫలితంగా 91 వేలకు పైగా ప్రత్యక్ష ఉపాధితో పాటు పరోక్షంగా అనేక ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్..30 సెకన్లు)-సెట్

గత పది సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్ రంగం అపారమైన వృద్ధిని సాధించిందని మంత్రి అన్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 1లక్షా 90 వేల కోట్ల ఎలక్ట్రానిక్ వస్తువుల దేశీయ ఉత్పత్తి జరిగిందని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9లక్షల 52 వేల కోట్లకు ఇది పెరిగిందని చెప్పారు.

==============================

భారతీయ నౌకాశ్రయాల బిల్లు-2025ను కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ ఈరోజు లోక్ సభలో ప్రవేశపెట్టారు.

==============================

==============================